క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 33, పొడుగు వంకాయ 33, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 52, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 53, దొండ 25, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 40, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 21, చామగడ్డ 38, మొరంగడ్డ 15, కందగడ్డ 40, సొరకాయ 11, పొట్లకాయ 20, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న శ్రీ గణేష్

రసూల్‌పురా: మన ఆరోగ్యం–మన నియోజకవర్గం పేరుతో శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం సిక్‌విలేజ్ శ్రీరాంనగర్, గాంధీ నగర్‌లో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ ఆధ్వర్యంలో కేర్ హాస్పిటల్, అగర్వాల్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు తమ ఫౌండేషన్ ఉచితంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు ప్రభాకర్, స్థానికులు పరశురాం, కైరా అనిల్, శంకర్, రాజు, మల్లేశం పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ


రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు మరువలేనివని హైకోర్టు న్యాయవాది పోసల గిరికృష్ణ అన్నారు. ఆదివారం సోమసుందరం వీధిలోని సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం భవనంలో పేద విద్యార్థులకు ఉచితంగా రాత పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం గత కొన్ని దశాబ్దాలుగా పేద ప్రజలు, విశ్వకర్మల కోసం సామాజిక, ఆర్థికంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రావు, ప్రకాష్, భాస్కరచారి, చక్రపాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టర్ రేవంత్‌కు సన్మానం


రేవంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సీతాఫల్‌మండి బీదలబస్తీకి చెందిన జీఎం రేవంత్‌ను బజరంగ్ మిత్రమండలి, బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇటీవల ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో 55 కేజీల విభాగంలో రేవంత్ కాంస్య పతకం సాధించాడు. సీతాఫల్‌మండి బీజేపీ డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు నేతృత్వంలో ఆదివారం నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రేవంత్‌కు శాలువా కప్పి సన్మానించారు.

న్యాయం కోసం కోర్టుకు క్యూనెట్ బాధితులు

కవాడిగూడ: క్యూనెట్ కంపెనీ మోసపూరిత కార్యక్రమాలను నిషేధించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ పెట్టుబడులను తిరిగి ఇప్పించాలని కోరుతూ క్యూనెట్ బాధితులు హైదరాబాద్ సిటీ క్రిమినల్ కోర్టును ఆశ్రయించనున్నట్లు క్యూనెట్ బాధితుల జేఏసీ కన్వీనర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్యూనెట్ బాధితులకు న్యాయవాది డాక్టర్ సాల్మన్ రాజు ఉచితంగా న్యాయ సేవలు అందించడం అభినందనీయమన్నారు. సుమారు 300 మంది క్యూనెట్ బాధితులు న్యాయం కోసం కోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. క్యూనెట్ కుంభకోణంపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు వేగంగా స్పందించి విచారణ జరిపి నిందితులను అరెస్టు చేయడం అభినందనీయమన్నారు. యాజమాన్యాన్ని సైతం అరెస్టు చేసి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలని కోరారు. క్యూనెట్ బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తామని న్యాయవాది సాల్మన్ రాజు పేర్కొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో బ్రోకర్లదే రాజ్యం

సమాధులు కప్పేసి.. అక్రమ వ్యాపారాలకు తెర లేపి!

- రైతుల పేరిట మాయాజాలం
- కమీషన్ ఇస్తే ఎవరైనా ఏజెంటే
- చక్రం తిప్పుతున్న మార్కెటింగ్ అధికారులు



బోయిన్‌పల్లి మార్కెట్ కార్యాలయం


సమాధులను మట్టితో కప్పి కొనసాగుతున్న వ్యాపారాలు

కంటోన్మెంట్: పేరుకు వ్యవసాయ మార్కెట్ కానీ.. అక్కడంతా బ్రోకర్లదే హవా. సరుకు తెచ్చేది, క్రయ, విక్రయాలు జరిపేది, కొనుగోలుదారులూ అంతటా మధ్యవర్తులదే రాజ్యం. ఇటు రైతులు, అటు మార్కెటింగ్ అధికారులనూ ఏమార్చుతూ మధ్యవర్తులు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. లైసెన్సులతో సంబంధమే లేకుండా ఎవరు పడితే వారు అక్కడ వ్యాపారం నిర్వహిస్తున్నారు. చనిపోయిన కమీషన్ ఏజెంట్‌ల పేరిట పెద్ద సంఖ్యలో బినామీలు వ్యాపారులుగా చెలామణి అవుతున్నారు. తమకు నిర్దేశించిన స్థలంతో పనిలేకుండా యార్డులో రోడ్లను ఆక్రమించుకుని మరీ ఎక్కడ పడితే అక్కడే వ్యాపారం సాగిస్తున్నారు. శ్మశానాలను సైతం వదలకపోవడం గమనార్హం. యార్డులో ఉన్న సమాధులను తవ్వి, మట్టితో కప్పేసి మరీ కూరగాయాల విక్రయాలు సాగిస్తున్నారు. అక్రమార్కుల ఆగడాలు మితిమీరడంతో అమాయకులైన పలువురు కమీషన్ ఏజెంట్లు నష్టపోతున్నారు. అడ్డుకోవాల్సిన మార్కెటింగ్ అధికారులు కొందరు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కూల్చివేతతో వెలుగులోకి..

2002లో సికింద్రాబాద్ మోండా ప్రాంతం నుంచి కూరగాయాల మార్కెట్‌ను బోయిన్‌పల్లికి తరలించే సమయంలో అప్పటి వ్యాపారులకు పక్కాభవనాలు నిర్మించి పూర్తి యాజమాన్య హక్కులు అప్పగించారు. అయితే కమీషన్ ఏజెంట్లకు కేటాయించిన స్థలాలను వారసులకు మినహా ఇతరులకు బదలాయించే అవకాశం లేదు. అయితే దొడ్డిదారిన పలువురు వ్యాపారులు తమ స్థలాన్ని నలుగురు ఐదుగురికి లీజుకిస్తూ అక్రమ దందాకు తెర లేపారు. అయితే లీజుదారులు తమ మార్కెట్ ఫీజును మాత్రం అసలు కమీషన్ ఏజెంట్ పేరిటే చెల్లిస్తుంటారు. అధికారికంగా 144 లైసెన్సులు మాత్రమే ఉండగా, దాదాపు నాలుగు రెట్లు వ్యాపారులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

పరస్పర విమర్శలతో బట్టబయలు..

ఇదిలా ఉండగా ఏ–3 దుకాణ కమీషన్ ఏజెంట్ మిరియాల నరేందర్ కొన్నేళ్ల క్రితమే మరణించినప్పటికీ, అతని దుకాణంలో బినామీలే వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఏ–3 దుకాణ సముదాయాన్ని రెండు భాగాలుగా విభజించి, ఇద్దరు వ్యక్తులు తమ సొంతం చేసుకున్నారు. పైగా ఆ సగం సగం దుకాణాన్ని మరో ఐదుగురికి లీజుకిచ్చి ఒకే చోట ఏడుగురు వ్యాపారం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఏ–3 లీజుదారుల్లో ఒకరు దుకాణాన్ని విస్తరించే క్రమంలో స్లాబును తొలగించారు. పునర్నిర్మాణానికి అధికారులకు దరఖాస్తు చేసుకోగా అసలైన కమీషన్ ఏజెంట్ అందుబాటులో లేని కారణంగా అనుమతులు పెండింగ్‌లో పెట్టారు. పాలకమండలి సభ్యుల్లో కొందరు దీన్ని తీవ్రంగా పరిగణిస్తూ అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిందేననే డిమాండ్‌ను లేవనెత్తారు. దీంతో ఒకరిపై ఒకరి విమర్శలతో మార్కెట్ తతంగం అంతా బహిర్గతమవుతోంది.



అక్రమ వ్యాపారాలకు కేంద్రంగా కొనసాగుతున్న ఏ–3 దుకాణ సముదాయం

విజిలెన్స్ విచారణకు డిమాండ్..

గత ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టిన బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ హారిక ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి, పలు అవకతవకలను గుర్తించారు. తక్షణమే వాటిని సరిదిద్ది అసలైన కమీషన్ ఏజెంట్లు, రైతులకు న్యాయం జరిగేలా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పులు రాకపోవడంతో విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు చేపడతాం

బోయిన్‌పల్లి మార్కెట్‌లో కొనసాగుతున్న అక్రమ, అనధికారిక వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. ఉద్దేశపూర్వకంగా రోడ్లను ఆక్రమించి, ఇతరుల వ్యాపారులను ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించం. లావాదేవీల్లో తేడాలు చూపుతూ మార్కెట్ ఆదాయానికి గండికొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
–శ్రీనివాస్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

కళాకారులు, కవుల పాత్ర కీలకం

అమీర్‌పేట: తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా సాహిత్య దినోత్సవ కవి సమ్మేళనం నిర్వహించారు.ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం తీసుకువచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేసిన మంచి పనులను ప్రజలు మర్చిపోరని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం సాధించిన ప్రగతిని కవులు కవిత్వాల రూపంలో వివరించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి భానుప్రసాద్, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు మానిక్‌రావు పాటిల్, ఆర్.సి.కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

ముగిసిన మ్యాజిక్ షో

రాంగోపాల్‌పేట్: మెజీషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన ఛూ మంతర్ మ్యాజిక్ షో ఆదివారంతో ముగిసింది. ఈ నెల 10వ తేదీన మెజీషియన్స్ అకాడమీ చైర్మన్ సామల వేణు ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ఈ మ్యాజిక్ షోలో 11 దేశాలకు చెందిన మెజీషియన్లు హాజరై తమ ఇంద్రజాలంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు జడ్జి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీవీ పట్టాభిరాంతో పాటు అంతర్జాతీయ మెజీషియన్లు పాల్గొన్నారు.


మెజీషియన్లను అభినందిస్తున్న జస్టిస్ లక్ష్మణ్

అత్యాధునిక వసతులతో వడ్డెర భవన్ నిర్మాణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలకు ఉప్పల్ భగాయత్‌లో ఎకరం స్థలం, రూ. కోటి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జె.సత్యనారాయణరాజు అన్నారు. ఈ నిధులతో అత్యాధునిక వడ్డెర ఆత్మగౌరవ భవనం నిర్మిస్తామన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ చైర్మన్‌గా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించి, నిరుపేద వడ్డెర విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు ఫంక్షన్‌హాల్, దూర ప్రాంతం నుంచి వచ్చిన వారికి విశ్రాంత గదులు, గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య మాట్లాడుతూ వడ్డెరల సంక్షేమం కోసం ట్రస్ట్ తరఫున కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ ఒర్సు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీరాములు, వెంకటకృష్ణ, ఎం.నర్సింహ్మా, గంజి సాయికృష్ణ, వరుకుప్ప లింగయ్య, అనంతరావు, ఎత్తరి మోహన్‌కుమార్, మల్లపు వెంకటేష్, నారాయణ, గణేష్, అశోక్, శ్రీనివాస్, చెన్నయ్య, సుధాకర్, గుండు స్వామి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాచిగూడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన కాచిగూడలోని భావసార్ భవన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. భవసార్ క్షత్రియ సంఘానికి కోకాపేటలో అర ఎకరం భూమి, భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కిషన్ రెడ్డి అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి 4 సంవత్సరాలు దాటినా స్థానిక ప్రజల సమస్యలు, అభివృద్ధిని విస్మరించారన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు కనీసం అందుబాటులో కూడా ఉండరని ఆరోపించారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి కోసం పని చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఆదరించాలని కోరారు.


మాట్లాడుతున్న మంత్రి తలసాని

భర్త వేధింపులతో మహిళ ఆత్మహత్య

అమీర్‌పేట: భర్త వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. బల్కంపేట బీకే గూడలో రాధిక అలియాస్ ప్రవీణ (35) రామానంద్ నేతికర్ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. రాధికకు తెలియకుండా వేరే మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న రామానంద్ రెండేళ్లుగా భార్యను వేధిస్తూ వస్తున్నాడు. ఇటీవల సదరు మహిళను ఏకంగా ఇంటికి తీసుకురావడంతో రాధిక పుట్టింటికి వెళ్లి పోయింది. అయినా ఆగకుండా ఫోన్‌లు చేసి మరీ వేధించేవాడు. వేధింపులు ఎక్కువకావడంతో రాధిక ఈ నెల 9న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. తన కూతురు ఆత్మహత్యకు అల్లుడే కారణమని రాధిక తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బీసీలపై వివక్ష తగదు

కవాడిగూడ: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల అభివృద్ధి పట్ల వివక్ష చూపడం తగదని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం దోమలగూడలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం అభినందనీయం అన్నారు. అయితే బీసీల్లో 126 కులాలు ఉండగా, కేవలం 26 బీసీ కులాలకే ఈ నిబంధలు వర్తించడం దారుణమన్నారు. బీసీలకు ఇచ్చే రూ. లక్షలో ఎమ్మెల్యేలు తమ ఖాతాల్లో రూ.40 వేలు జమ చేస్తేనే నిధులు మంజూరు చేస్తామని హుకుం జారీ చేస్తున్నారని ఆరోపించారు. దళిత బంధులో అవినీతి జరిగిందని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పినా బాధ్యులపై నేటికీ చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకర మన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 126 కులాల బీసీ పేద కుటుంబాలకు రూ.లక్ష మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో బీసీలు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మహిళలకు సాధ్యం కానిది లేదు

కాచిగూడ: మహిళలు తలుచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. శిల్పారామంలో నిర్వహించిన ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు 100 స్టాళ్లలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు ప్రత్యేకతను చాటాయన్నారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా వారిని సావిత్రిబాయి పూలే మహిళా సంఘం అధ్యక్షురాలు బెల్లం మాధవి తదితరులు సత్కరించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అర్హులందరూ వినియోగించుకునేలా చూడాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేసీఆర్ సహకారంతో ఈ తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధిని సాధించామన్నారు. నియోజకవర్గ పరిధిలో పకడ్బందీగా డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు తమ తమ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. త్వరలోనే మున్సిపల్ వార్డు కార్యాలయాలను ప్రారంభించడం జరుగుతుందని, జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా వార్డు ఆఫీసుల్లోనే ఫిర్యాదు చేయవచ్చన్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న అనేక దేవాలయాలకు నూతనంగా కమిటీలను నియమించడం జరిగిందని, మిగిలిన దేవాలయాలకు కూడా త్వరలోనే కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారి కోసం ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం వచ్చే నెలలో ప్రారంభించనుందని ఈ కార్యక్రమం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని ఇంటి నిర్మాణ పనులను బట్టి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, పీఎల్ శ్రీనివాస్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం..

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ బస్తీలో ఆదివారం స్థానిక కార్పొరేటర్ హేమలతతో కలిసి మంచినీటి నల్లాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి సనత్‌నగర్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో ఎన్నో పనులు చేపడుతున్నామన్నారు. బండమైసమ్మనగర్ మురికివాడలో ప్రజలకిచ్చిన హామీ మేరకు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారమే లక్ష్యం

కంటోన్మెంట్: రామన్నకుంట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నామని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం సౌజన్య కాలనీ ప్రధాన మార్గం వద్ద ఉన్న జైకా లైను, రామన్నకుంట ఔట్‌ఫ్లోతో కలిపే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. రామన్నకుంటకు ఎగువన ఉన్న జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రాంతాల మురుగు నేరుగా కుంటలో కలుస్తోందని దీన్ని మళ్లించేందుకు అంటూ కేవలం రూ.3 కోట్లతో తాత్కాలిక పనులు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందన్నారు.

- రామన్నకుంట ఓవర్ ఫ్లో సాఫీగా కిందకు వెళ్లేందుకు అనువైన మూడు తూములను అక్రమార్కులు కబ్జా చేశారని బీజేపీ సీనియర్ నేత భానుక మల్లికార్జున్ ఆరోపించారు. మహాత్మానగర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ పక్కన, సౌజన్య కాలనీ మీదుగా వెళ్లే తూములు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం

రసూల్‌పురా: బస్తీబాట కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ తెలిపారు. ఆదివారం రెండవ వార్డు శ్రీలంక బస్తీలో బోర్డు నిధులతో చేపట్టే నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులకు రామకృష్ణ శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇటీవల శ్రీలంక బస్తీలో బస్తీబాట నిర్వహించిన సందర్భంలో స్థానికులు భూగర్భ డ్రైనేజీ సమస్య తన దృష్టికి తీసుకువచ్చారని సమస్యను పరిష్కరించేందుకు బోర్డు నిధులతో నూతన పైపులైన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుష్మిత, వార్డు అధ్యక్షుడు మాదారపు అశోక్, జగన్ మహేష్, బస్తీ వాసులు సమీర్, ఇర్ఫాన్, రమేష్, సోను పాల్గొన్నారు.


జైకాలైన్ అనుసంధాన పనుల ప్రారంభోత్సవంలో బోర్డు సభ్యుడు రామకృష్ణ

బస్తీల బాధలు తొలగిస్తా

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని బస్తీల బాధలు తొలగించడమే తన కర్తవ్యం అని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. తాను చేపట్టిన బస్తీనిద్ర 12 వారం కార్యక్రమాన్ని శని, ఆదివారాల్లో ఐదో వార్డు గాంధీనగర్‌లో నిర్వహించారు. శనివారం రాత్రి బస్తీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో స్థానికులతో మాట్లాడిన ఆయన అనంతరం వారితో కలిసి అక్కడే భోజనం చేసి బసచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాలకు సంబంధించి బోర్డు అధికారులను కలిసి దశల వారీగా కల్పిస్తానన్నారు. బస్తీలోని నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధికి తన వంతుగా సొంత నిధులతో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటా రాజు, యాదగిరి, మల్లప్ప, బీమప్ప, గడ్డం రాజు, మోనీ, రఘు, సాయి పాల్గొన్నారు.



గాంధీ నగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న క్రిశాంక్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ అన్నారు. అడ్డగుట్టలో నిర్వహించిన బస్తీపోరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బంగారు తెలంగాణలో ప్రజల బతుకులు మారలేదని, ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్తీ పోరుకు శ్రీకారం చుట్టామన్నారు. నియోజకవర్గంలో 10 వేల డబుల్ బెడ్రూమ్‌లు నిర్మిస్తామని స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చెప్పారని.. ఇప్పటి వరకు 500 ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. అడ్డగుట్ట ఏర్పడి 40 ఏళ్ల గడిచినా డ్రైనేజీ వ్యవస్థలో మార్పు రాలేదని, 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి ఆ మాటే మర్చిపోయారన్నారు. మెట్టుగూడ శ్మశాన వాటికలో ఆక్రమణలను తొలగించలేదని, కనీస మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రజలు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఆదం సృజన్, గంటరాజు, సందీప్, అమర్‌నాథ్, అనిల్, హరి, శాస్త్రి, యూసుఫ్, జాఫర్, నాగభూషణం పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



అపూర్వ సమ్మేళనం

ప్రకాశం జిల్లా కందుకూరు తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ కళాశాలలో 1977లో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం అదివారం నగరంలో ఓ ప్రవేటు హోటల్లో జరిగింది. ఈ సందర్భంగా అప్పటి అనుభూతులు, అనుభావాలు గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, షమ్స్ బేగం, రామ్మోహన్, అరుణ, ఉమ, వెంకట సుధాకర్ పాల్గొన్నారు. –అడ్డగుట్ట